సాక్షి నల్లగొండ

శనివారం । 16 । ఆగస్టు । 2025

శ్రీకృష్ణ, గోపికల ఫొటోలకు 'సాక్షి' ఆహ్వానం

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మీ చిన్నారులను కృష్ణుడి, గోపికల వేషధారణలో అందంగా ముస్తాబు చేసి ఆ ఫొటోలను నేడు (శనివారం) మాకు పంపించండి. ఆదివారం సంచికలో మీ చిన్నారుల ఫొటోలను ప్రచురిస్తాం. మీ చిన్నారుల వయస్సు 10 సంవత్సరాలలోపు ఉండాలి. గత సంవత్సరం ఫొటోలు పంపవద్దు. ఇప్పుడు అలంకరించి తీసిన ఫొటోలనే పంపాలి. మీ చిన్నారుల పేరు, గ్రామం, మండలం, పట్టణం తప్పని సరిగా పేర్కొనాలి.



ఫొటోలు పంపాల్సిన వాట్సప్ నంబర్ : **99123 62784**

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం :		**590** అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	:	**586.90** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**1,46,296** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**1,44,774** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	**29,476** క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	**4,050** క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	**2,400** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

ఎర్రకోట ఉత్సవాల్లో కోతులారం రైతు దంపతులు



ఎర్రకోటలో జరిగిన స్వాతంత్య్ర ఉత్సవాల్లో పాల్గొన్న రైతు బుచ్చిరాములు దంపతులు

మునుగోడు : ఢిల్లీ ఎర్రకోటలో శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్య్ర వేడుకల్లో మునుగోడు మండలం కోతులారం గ్రామానికి చెందిన రైతు జాజుల బుచ్చిరాములు, సైదమ్మ దంపతులు పాల్గొన్నారు. బుచ్చిరాములుకు 10 పదెకరాల భూమి ఉండగా.. అందులోని 8 ఎకరాల్లో కలబంధ సాగు చేస్తున్నాడు. ఔషధ రంగంలో ఉపయోగించే కలబంధను ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. దీతో కేంద్ర ఆయుష్ విభాగం ఆహ్వానం మేరకు ఢిల్లీలో జరిగిన స్వాతంత్య్ర వేడుకలకు రైతు రామ్మూర్తి దంపతులు హాజరయ్యారు.

లీగల్ అడ్వయిజర్‌గా గోవర్ధన్



నల్లగొండ టౌన్ : బీసీ సంక్షేమ సంఘం జిల్లా లీగల్ అడ్వయిజర్‌గా నల్లగొండ పట్టణానికి చెందిన రిటైర్డ్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్, న్యాయవాది గుంటోజు గోవర్ధన్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోవర్ధన్ నియామకంపై సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేశబోయిన శంకర్‌ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు.

సాగర్‌లో ట్రాఫిక్ జామ్



నిలిచిపోయిన వాహనాలు

నాగార్జునసాగర్ : సాగర్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతుండటంతో పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పర్యాటకులు వచ్చిన కార్లు, బైక్‌లు, మినీ బస్సులను నదీ తీరం వెంట సాగర్ నుంచి మాచర్ల వెళ్లే కొత్త వంతెన సమీపంలో రోడ్డు నిలిపుతున్నారు. దీంతో పలుమార్లు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు అప్రమత్తమైన ట్రాఫిక్ క్లియర్ చేసి వాహనాలను పంపించారు.

హెడ్‌కానిస్టేబుల్ చేత జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న బక్కయ్య

నల్లగొండ: షీటీమ్ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బక్కయ్య జెండా ఆవిష్కరించారు. బక్కయ్య ఈ నెల 31న పదవీ విరమణ పొందనున్నారు. 40 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో పని చేసి పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా షీటీమ్స్ సీఐ కరుణాకర్ ఆయనకు జెండా ఆవిష్కరించే అవకాశాన్ని కల్పించారు. జెండా ఆవిష్కరించిన బక్కయ్య బావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో షీటీమ్ ఎస్ఐ గౌస్, భరోసా ఎస్ఐ అంజలి, హెడ్‌కానిస్టేబుల్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

- విద్యా, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాం
- ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి తీరుతాం
- హ్యామ్ పద్ధతిలో రోడ్లు నిర్మిస్తున్నాం
- నల్లగొండను బంగారుకొండ చేసేందుకు కృషి చేస్తున్నాం
- స్వాతంత్య్ర వేడుకల్లో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, పక్కన కలెక్టర్, ఎస్పీ

"నల్లగొండ అంటేనే త్యాగాలకు పుట్టిల్లు. తల్లి దండ్రులు నాకు జన్మనిస్తే ఈ గడ్డ రుణం తీర్చుకునే భాగ్యం ఇక్కడి ప్రజలు కల్పించారు. రాష్ట్రం కోసం ఆమరణ దీక్షకు కూర్చుంటే వీరతిలకం దిద్ది పోరు చేయి బిడ్డా అంటూ వెన్నంటే ఉన్నారు.

– స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి





నల్లగొండలోని పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ తదితరులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం సంక్షమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా నల్లగొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తామన్నారు. ప్రధానంగా విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే కామన్ పీపుల్‌కు సింబల్ అన్నారు. దేశ చరిత్రలో నిలిచిపోయేలా కులగణన చేశామని.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కంకణం కట్టుకున్నాని పేర్కొన్నారు. నల్లగొండను బంగారు కొండగా మార్చాలనే సంకల్పంతో జిల్లాలో ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిదులు సమష్టిగా కృషి చేస్తున్నారన్నారు.

ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తాం..

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నాం. కానీ.. ప్రతిపక్షాలు ప్రాజెక్టును ఆపేయాలనే దుష్ట ప్రచారం మొదలు పెట్టాయని.. వాళ్లకు సీట్లు, ఓట్లు, కమీషన్లు తప్ప మరో అవసరం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్య, వైద్యం, సాగు, తాగునీటి రంగాలకు అన్యాయం చేసిందన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి రోడ్లే జీవనాడులు..

రాష్ట్ర అభివృద్ధికి జీవనాడులు రోడ్లే అని, రోడ్లు బాగుంటే రాష్ట్ర అభివృద్ధి ముఖ చిత్రమే మారుతుందన్నారు. అందుకే రాష్ట్రంలో హ్యాం పద్ధతిలో రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. జిల్లా కేంద్రాల నుంచి రాజధానికి 4 వరుసల రోడ్లు, మండలాల నుంచి జిల్లా కేంద్రాలకు 2 వరుసల రోడ్లు, గ్రామాలను కలిపేలా రోడ్లను బలోపేతం చేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు.

అన్ని పథకాలు అమలు చేస్తున్నాం

ప్రజా సంక్షేమం కోసం అనే పథకాలు అమలు చేస్తున్నామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆడ పడుచులు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి నియోజకవర్గానికి 3,500 గృహాల చొప్పున 19,526 నిర్మించాలని తలపెట్టామని.. వాటిలో 4300 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. జిల్లాలో కొత్తగా 65,276 కొత్త రేషన్ కార్డులను ఇచ్చామన్నారు. పాత కార్డుల్లో 82,364 మంది సభ్యులను చేర్చి.. కార్డు దారులకు సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. జిల్లాలో 2,43,175 మందికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు.

బ్రాహ్మణ వెల్లెంల పూర్తిచేశాం

జిల్లాలో సాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి బ్రాహ్మణవెల్లెంల లిఫ్ట్ ఇరిగేషన్, రిజర్వాయర్ పనులు పూర్తిచేసి సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. నెల్లికల్లు లిఫ్ట్ కింద 24,866 ఎకరాల ఆయకట్టు పెంచడానికి పరిపాలన ఆమోదం పొందామన్నారు. కేశవాపురం, కొండ్రపోల్, బొత్తలపాలెం, వాడపల్లి, వీర్లపాలెం, తోపుచర్ల, దున్నపోతులగండి తదితర లిఫ్ట్‌ల కోసం నిధులు మంజూరు చేశామన్నారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ కింద 3.61 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా పని చేస్తున్నామన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం

ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జిల్లాలో 2,33,981 మంది రైతులకు రూ.2044.83 కోట్ల రుణమాఫీ చేశామన్నారు. రైతు భరోసా కింద 5,26,363 మంది రైతులకు రూ.716.48 కోట్లు ఇచ్చామన్నారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు ఇస్తున్నామని.. 38,539 మెట్రిక్ టన్నుల యూరియాపాటు 3,66,872.45 టన్నుల ఎరువులను సిద్ధంగా ఉంచామన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. జిల్లాలో 2928 మందికి 5577 ఎకరాల పోడు పట్టాల పంపిణీ చేశామన్నారు.



నల్లగొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థుల నృత్య ప్రదర్శన

వైటీపీఎస్ పనులు వేగంగా జరుగుతున్నాయి

జిల్లాలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి రూ.110 కోట్లతో 40 సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నామని తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిని 200 పడకలకు పెంచామని.. గంధంవారిగూడెంలో నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి ప్రతి నియోజకవర్గంలో భూములు కేటాయించామని.. నల్లగొండలో ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పర్యవేక్షణకు పోలీస్‌శాఖ మిషన్ పరివర్తన్ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా జిల్లా సరోతముఖాభివృద్ధికి కృషి చేస్తున్న శాసన మండలి చైర్మన్, ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా ప్రదాన న్యాయమూర్తి, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అధికార యంత్రాగానికి ధన్యవాదాలు తెలిపారు.

డీసీసీబీని లాభాల దిశగా నడిపిస్తాం



పాలాభిషేకం చేస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)ని లాభాల దిశగా నడిపించడానికి తమ పాలకవర్గం కృషి చేస్తుందని బ్యాంకు చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తమ పాలకవర్గం పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిడించినందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే లాభాల బాటలో పయనిస్తున్న బ్యాంకును వచ్చే ఆరునెలల కాలంలో మరింత బలోపేతం చేయనున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, సభ్యులు పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదులు, కొంద సైదయ్య, ధనావత్ జయరాం, బుంటు శ్రీనివాస్, వీరస్వామి, గొల్లగూడ సొసైటీ చైర్మన్ నాగరత్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఎమ్మార్పీ నాలుగు మోటార్ల ద్వారా నీరు



పుట్టంగండి పంపుహౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

పెద్దఅడిశర్లపల్లి : ఏఎమ్మార్పీ నాలుగో మోటార్ వినియోగంలోకి వచ్చింది. నల్లగొండ జిల్లాకు సాగు, తాగునీటి అవసరాలు, హైదరాబాద్ జంటనగరాలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు గాను ఏఎమ్మార్పీ నుంచి ఉదయ సముద్రానికి నీటి విడుదల కొనసాగుతుంది. పుట్టంగండి వద్ద గల సాగర్ వెనుక జలాల నుంచి ఏఎమ్మార్పీ నాలుగు మోటార్ల ద్వారా 2400 క్యూసెక్కుల నీరు ఏకేబీఆర్‌కి రావాల్సి ఉంది. అయితే యూనిట్ – 4 మోటారు మే నెలలో మరమ్మతులకు గురికావడంతో అధికారులు మే 28న బాగు చేసే పనులు ప్రారంభించారు. దీంతో మూడు మోటార్ల ద్వారా మొన్నటి వరకు కేవలం 1800 క్యూసెక్కుల నీరు ఏకేబీఆర్‌కు వచ్చింది. దీంతో ఉదయసముద్రానికి 1000 క్యూసెక్కుల నీటి మాత్రమే విడుదల చేశారు. ప్రధాన కాలువ వెంట ఉన్న డిస్ట్రిబ్యూటరీలకు సరిపడా నీరు అందలేదు. అంతే కాకుండా ఏకేబీఆర్ లెవల్‌ను పెంచడానికి సరిపడా నీరు అందకపోవడంతో డి–7బీకి నీటి విడుదల సాధ్యం కాలేదు. మోటార్ మరమ్మతు పనులు బుధవారం పూర్తయ్యాయి. యూనిట్ – 4 మోటారును తిరిగి ప్రారంభించారు. దీంతో గురువారం నుంచి ఏఎమ్మార్పీ నాలుగు మోటార్ల ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు పంపుతున్నారు. అక్కడినుంచి ప్రధానకాలువ ద్వారా 1130 క్యూసెక్కులు ఉదయ సముద్రానికి, హైదరాబాద్ జంటనగరాలకు 525 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 45 క్యూసెక్కులు, డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదల కొనసాగుతుందని ఏఎమ్మార్పీ అధికారులు తెలిపారు.

జాతీయ అవార్డు అందుకున్న రఘునందన్

రామగిరి(నల్లగొండ): పొగాకు నియంత్రణకు 20 ఏళ్లుగా కృషి చేస్తున్న మాచన రఘునందన్ నేషనల్ టొబాకో కంట్రోల్ హీరోస్ 2025 అవార్డు అందుకున్నారు. పొగాకు నియంత్రణ అంతర్జాతీయ వేదిక రిసోర్స్ సెంటర్ ఫర్ టుబాకో కంట్రోల్ (ఆర్‌సిటిసి) ఈ అవార్డును అందజేసింది. శుక్రవారం రఘునందన్ వర్చువల్‌గా జరిగిన సమావేశంలో పాల్గొని అవార్డు స్వీకరించారు. ఫుడ్ కార్పొరేషన్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ పనిచేస్తూ సమాజ హితం కోసం రఘునందన్ పాటు పడుతున్నట్లు ఆర్‌సిటిసి ఆచార్యులు డాక్టర్ సోనూ గోయల్ కొనియాడారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్టింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. ఇక ప్రధానాలయంలోనూ నిత్యారాధనలు కొనసాగాయి. వేకువ జామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ, ఆరాధన చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్టా అలంకారమూర్తులను అభిషేకం, సహస్రనామార్చనతో కొలిచారు. ఇక ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణ వేడుక, వెండి జోడు సేవోత్సవం నిర్వహించారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



వీరారెడ్డి స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : దేశంలో అంతరాలు లేని సమాజస్థాపనకు ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలం రాయినిపాలెం గ్రామంలో నిర్వహించిన రాగిరెడ్డి వీరారెడ్డి 44వ వర్ధంతిలో ఆయన మాట్లాడారు. ముందుగా సీపీఎం కార్యాలయం నుంచి రాయినిపాలెం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఉన్న వీరారెడ్డి స్తూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. భూ పంపిణీ చేయాలని రాగిరెడ్డి వీరారెడ్డి రాజీలేని పోరాటాలు చేశారని గుర్తుచేశారు. వీరారెడ్డి ఉద్యమాలను తట్టుకోలేక దారుణంగా హత్య చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, జగదీష్‌చంద్ర, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, పాదూరి శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, పోలెబోయిన వరలక్ష్మి, శ్రీనివాస్, రామ్మూర్తి, ఊర్మిల, గోవర్ధని, అరుణ, వాడపల్లి రమేష్, సైదులు, గోవిందరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌కు స్వల్పంగా తగ్గిన వరద



- 14 గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్: ఎగువ నుంచి సాగర్‌కు వరద స్వల్పంగా తగ్గింది. నాలుగు రోజులుగా 26గేట్లను ఎత్తిన అధికారులు.. శుక్రవారం 14గేట్లకు తగ్గించి నీటిని విడుదల చేస్తున్నారు. వద్ద పద్నాలుగు క్రస్ట్‌గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతున్నాయి. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి 1,44,694 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం నుంచి 14 గేట్ల నుంచి, విద్యుదుత్పాదనతో కలిపి 1,38,244 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణా నదిలోకి విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 586.90 అడుగులు ఉంది.

ఉప్పొంగిన డిండి



డిండి : ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు దుందుబి వాగు ద్వారా మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి అలుగుపోస్తోంది. శుక్రవారం సెలవు దినం కావడంతో డిండి ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి పెరింగింది. ఈ క్రమంలో ప్రాజెక్టు వద్ద ఆగి డ్యాం అలుగుపోస్తున్న అందాలను కొందరు తమ సెల్‌ఫోన్లో బంధిస్తుండగా మరికొంతమంది సెల్ఫీ దిగారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 24,105 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ఇరిగేషన్ ఏఈ పరమేష్ తెలిపారు.

డిండి ప్రాజెక్టు అలుగు ద్వారా దిగువకు పోతున్న వరద నీరు

మూసీ ప్రాజెక్టుకు భారీగా నీరు



కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు శుక్రవారం వరద పెరిగింది. దీంతో అధికారులు ప్రాజెక్టు తొమ్మిది క్రస్ట్‌గేట్లను ఎత్తి వరదనీటిని దిగువకు వదులుతున్నారు. శుక్రవారం ఉదయం 7,200 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సాయంత్రానికి 15,109 క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టులో ఇప్పటికే నీటిమట్టం 645 అడుగుల గరిష్ట స్థాయికి చేరువలో ఉండటంతో అప్రమత్తమైన అధికారులు ఉదయం తెరిచిన ఆరు క్రస్టు గేట్లకు అదనంగా సాయంత్రం మరో మూడు క్రస్టు గేట్లను(మొత్తం 9 గేట్లు) రెండు అడుగుల మేర ఎత్తి 14,910 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఆయకట్టులో పంటల సాగుకు 140 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న వరదనీరు


నల్లగొండలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి


సూర్యాపేటలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు


సూర్యాపేటలో ఎగ్జిబిషన్ స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


నల్లగొండలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


నల్లగొండలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు


భువనగిరిలో సెర్ప్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శకటం ప్రదర్శన


విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావు


భువనగిరిలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఉత్తమ సేవలకు గుర్తింపు


మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఆయా శాఖల అధికారులకు గుర్తింపు లభించింది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.


రమేష్, పశు సంవర్ధక శాఖ అధికారి, నల్లగొండ
సింధుశ్రీ, గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి, నల్లగొండ
బ్లెస్సీ, పీహెచ్‌సీ, చండూరు
శశికళ, ఎస్సీ డీడీ, నల్లగొండ
మౌనిక, ఏఎస్పీ, దేవరకొండ
కృష్ణవేణి, పీడీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, నల్లగొండ


రాజేష్, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ గుడిపల్లి
నాగయ్య, హెడ్మాస్టర్, అంతంపేట ప్రైమరీ స్కూల్
శివరాంరెడ్డి, డీఎస్పీ నల్లగొండ
జ్యోతి, ఏఈ హౌజింగ్ తిప్పర్తి
ప్రదీప్‌రెడ్డి, అసిస్టెంట్ మార్కెట్ సూపర్‌వైజర్, చిట్యాల
వెంకటమ్మ, టీచర్, ఎస్‌ఎల్ బీసీ ప్రైమరీ స్కూల్, నల్లగొండ
వెంకన్న, అసిస్టెంట్ కమాండెంట్, నల్లగొండ
ఎంటీ. అక్తర్ రహ్మాన్, ఏపీ, 12వ బెటాలియన్
రంజిత్‌కుమార్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, నల్లగొండ
మమత, సీనియర్ అసిస్టెంట్ డీపీఓ, నల్లగొండ
అంజయ్య, రిటైర్డ్ సీఐ, జీసీఆర్‌బీ, నల్లగొండ


బోయ అమరేందర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్, నల్లగొండ
ఏసీహెచ్ పుల్లారావు, రెడ్ క్రాస్ సొసైటీ, వైస్ చైర్మన్
కొండల్‌రెడ్డి, సీఐ శాలిగౌరారం, నల్లగొండ
సైదులు, ఎస్‌ఐ టూటౌన్, నల్లగొండ
నరేందర్, హెడ్‌కానిస్టేబుల్, డీసీఆర్‌బీ నల్లగొండ
రమేష్‌నాయక్, ఎస్‌ఐ, కొండమల్లేపల్లి
వెంకన్న, ఎస్‌ఐ, చండూరు
సాయిప్రశాంత్, ఎస్‌ఐ, హాలియా
శ్రేయాక్ష, ఐబీఆర్ అచీవర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, నల్లగొండ
జోస్పెన్, స్టాఫ్ నర్సు, పీహెచ్‌సీ మునుగోడు
సిలోహిణి, లెక్చరర్, నర్సింగ్‌కాలేజ


శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్ మెడికల్ కాలేజి, నల్లగొండ
సుహాసిని, సీనియర్ మెడికల్ ఆఫీసర్, నల్లగొండ
లావణ్య, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, మునుగోడు
విశాల్ రాజ్, ఏఈఈ, ఎస్సీ కార్పొరేషన్, నల్లగొండ
రాము, జూనియర్ అసిస్టెంట్, సివిల్ సప్లయ్, నల్లగొండ
రేణుక, జూనియర్ అసిస్టెంట్, జిల్లా సహకార కార్యాలయం
రవి, మండల పంచాయతీ అధికారి, మర్రిగూడ
పద్మ, మండల పంచాయతీ అధికారి, గుర్రంపోడు
భారతమ్మ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, నల్లగొండ
రమేష్, అడిషనల్ ఎస్పీ, నల్లగొండ
కొండయ్య, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, నల్లగొండ

యువతి ఆత్మహత్య కేసులో నలుగురు నిందితులకు రిమాండ్

పాలకవీడు: మండలంలోని రావిపహాడ్ గ్రామానికి చెందిన బట్టు కళాశ్రీ (20) ఈ నెల 9న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తండ్రి శేషగిరిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపారు. అదనపు కట్నం కోసం కళాశ్రీ అత్త ఉమాదేవి, మామ హనుమంతరావు, ఆడపడుచు ప్రియదర్శిని, భర్త పవన్‌కళ్యాణ్ కళాశ్రీని తరచూ వేధించేవారు. భర్త మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో భరించలేక యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై కోటేష్ తెలిపారు. నలుగురు నిందితులను శుక్రవారం హుజూర్‌నగర్ కోర్టు ఎదుట హాజరుపరచగా నల్లగొండ సబ్ జైలుకు తరలించినట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

భువనగిరిటౌన్ : ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం భువనగిరి పట్టణ కేంద్రంలోని బహర్‌పేటలో చోటుచేసుకుంది. భువనగిరిలో గురువారం జరిగిన బోనాల పండగలో శుభాకాంక్షలు తెలిపేందుకు ఫ్లెక్సీలను కడుతుండగా కమ్మ ఉదయ్ కిరణ్ (24) విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గాయాలు కావడంతో వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం మృతుడి తండ్రి కమ్మ వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


ప్రభాకర్ (ఫైల్)

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరటికల్ గ్రామానికి చెందిన కట్టెకోల ప్రభాకర్(55), చిన్నం నర్సయ్యతో కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై ఆత్మకూరు(ఎం) నుంచి కొరటికల్‌కు వెళ్తున్నాడు. అదే గ్రామానికి చెందిన సుంచు మహేష్ అతని భార్యతో కలిసి కొరటికల్ నుంచి ఆత్మకూరు(ఎం)కు బైక్‌పై వస్తున్నాడు. కేజీబీవీ పాఠశాల సమీపంలో టీవీఎస్ ఎక్సెల్, బైక్ ఢీకొన్నాయి. దీంతో ప్రభాకర్‌తో పాటు సుంచు మహేష్‌కు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ ప్రభాకర్‌ను భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య రేణుక శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ హనుమంతు తెలిపారు.

అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లిన కారు


సాగర్ ఎడమ కాలువలో పడిన కారు

నేరేడుచర్ల : కారు అదుపుతప్పి సాగర్ ఎడమ కాలువలో పడింది. పెన్‌పహాడ్ మండలం అన్నారం గ్రామానికి చెందిన నారాయణ నరేష్‌రెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సూర్యాపేటలో నూతన ఇంటి నిర్మాణం కోసం సామగ్రిని కారులో తీసుకువచ్చాడు. ఇంటి వద్ద సామగ్రిని పెట్టి తన అత్తగారి ఊరైన ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు బయలుదేరాడు. సూర్యాపేట మీదుగా మిర్యాలగూడకు వెళ్లేందుకు నేరేడుచర్ల మండలం కల్లూరు అడ్డ రోడ్డు వద్దకు వచ్చాడు. మిర్యాగూడ రోడ్డు వైపు వెళ్లకుండా పొరపాటున సాగర్ ఎడమ కాలువ వైపు తిప్పాడు. దీంతో కారు అదుపుతప్పి కాలువలో పడిపోయింది. నరేష్‌రెడ్డి కారు నుంచి దూకడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికుల సహకారంతో కారు బయటకు తీశారు.

అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

తిప్పర్తి: అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి మనస్థాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన తిప్పర్తి మండలంలోని తిప్పర్తి- రాయినిగూడం రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన బండారు మహేష్ (37) ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. అప్పులు ఎక్కువ కావడం, వాటిని తీర్చే మార్గం లేకపోవడంతో మనస్థాపానికి గురై గురువారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ రైల్వేస్టేషన్ మాస్టర్ అభినవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

గంజాయి నిందితుల అరెస్టు

- 1.650 కేజీల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖరరాజు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

హాలియా : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. శుక్రవారం హాలియా పోలీస్ స్టేషన్‌లో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం సిరిగిరిపాడు గ్రామానికి చెందిన వజ్రాల రాజశేఖర్, నల్లగొండ జిల్లా అనుముల మండలం పంగవానికుంటతండాకు చెందిన కుందాల వేణు, తిరుమలగిరి(సాగర్) మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన గురజాల మహేందర్ గంజాయికి అలవాటు పడి ముఠాగా ఏర్పడ్డారు. ఆంధ్రాకు చెందిన గడిగంటి అచ్చయ్య, తిరుమలకొండ యేసుబాబు వద్ద గంజాయి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో అనుముల మండలంలోని పంగవానికుంటతండా శివారులోని అల్వాల ఎక్స్‌రోడ్డు వద్ద శుక్రవారం గంజాయిని విక్రయిస్తున్నారనే సమాచారం పోలీసులకు అందింది. హాలియా పోలీసులు అల్వాల ఎక్స్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని ఆపి తనిఖీ చేయగా 1.650 కేజీల గంజాయి లభ్యమైంది. ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకోగా, వారిని అరెస్టు చేశారు. గంజాయి సరఫరాకు సంబంధించిన గడిగంటి అచ్చయ్య, తిరుమలకొండ యేసుబాబు పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద 1.650 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనం, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన హాలియా సీఐ సతీష్‌రెడ్డి, ఎస్‌ఐ సాయి ప్రశాంత్‌లను డీఎస్పీ అభినందించారు.

త్రివర్ణ పతాక అలంకరణలో సాయినాథుడు


త్రివర్ణ పతాక అలంకరణలో దర్శనమిస్తున్న సాయినాథుడు

చింతపల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయంలో శుక్రవారం లక్ష గాజుల పూజ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి సామూహిక కుంకుమార్చనలు లక్ష గాజుల పూజా కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు వేరే సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రేణుక రాజేశ్వరి పీఠాధిపతి మేలురి నవీన్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది మాదిరిగానే త్రివర్ణ పతాకంతో సాయినాథుడికి ప్రత్యేక అలంకరణ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచిగంటి ధనంజయ, ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకటయ్య, కోశాధికారి ఊరే కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవనం సిబ్బందికి ప్రశంసా పత్రాలు


సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య

నాగార్జునసాగర్ : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం బుద్ధవనం సిబ్బందికి ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ప్రశంసా పత్రాలు అందజేశారు. అంతకుముందు బుద్ధవనంలోని మహాస్థూపం వద్ద జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. 20ఏళ్లుగా బుద్ధవనంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని ప్రోత్సహించే విధంగా ప్రశంసా పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, మేనేజర్ రవిచంద్ర, బుద్ధవనం ఆర్ట్ అండ్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్‌రావు, డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ నాజీష్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ స్వాతంత్య్ర వేడుకల్లో కోదాడ విద్యార్థులు


ఢిల్లీలో జరిగిన వేడుకల్లో కోదాడలోని తేజ విద్యాలయం విద్యార్థులు

కోదాడరూరల్ : ఢిల్లీలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవంలో కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గల తేజ విద్యాలయానికి చెందిన 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా దేశవ్యాప్తంగా భారత రక్షణశాఖ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో 2లక్షల మంది విద్యార్థులు పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 200మంది విద్యార్థులకు ఢిల్లీలో జరిగే స్వాతంత్య్ర వేడుకలకు హాజరయ్యేందుకు అవకాశం దక్కింది. వారిలో కోదాడ తేజ విద్యాలయం విద్యార్థులు 15 మంది ఉన్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు.

గోల్కొండ కోటలో మోగిన సతీష్ డప్పు దరువు

గరిడేపల్లి: గోల్కొండ కోటలో శుక్రవారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీష్ మ్యూజిక్ అకాడమీ డప్పు కళా బృందం, మహిళా డప్పు కళాకారులు పాల్గొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ రాష్ట్ర డైరెక్టర్ మామిడి హరికృష్ణ సహకారం, అందె మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ అందె భాస్కర్ సౌజన్యంతో గోల్కొండ కోటలో డప్పుల దరువు ప్రదర్శనలో పాల్గొన్నట్లు మాస్టర్ అమరవరపు సతీష్ తెలిపారు. వేడుకల్లో కల్పన, స్వరూప, భువన, అపర్ణ, నాగమణి, వీరబాబు, శోభన్, గంగ, వెంకటమ్మ, కుమారి, సంజయ్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.


గోల్కొండ కోటలో డప్పుల దరువు ప్రదర్శించిన కళాకారులు